# హైదరాబాద్ సీపీగా సందీప్ శాండిల్య



సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా సందీప్ శాండిల్య నియమితులయ్యారు. నగర పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన సీవీ ఆనంద్ ఇటీవల బదిలీ అయిన విషయం తెలిసిందే. కొత్త పోలీసు కమిషనర్‌ను ఎంపిక చేయడంలో భాగంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ముగ్గురు అదనపు డీజీ ర్యాంకు అధికారుల పేర్లను కేంద్ర ఎన్నికల సంఘానికి పంపించారు. ప్రస్తుతం తెలంగాణ స్టేట్ పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సందీప్ శాండిల్యను నగర పోలీస్ కమిషనర్‌గా ఎంపిక చేస్తూ ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. 1993వ ఐపీఎస్ బ్యాచ్‌కు చెందిన సందీప్ శాండిల్య 2005 నుంచి 2007 వరకు సౌత్‌జోన్ డీసీపీగా, 2012 నుంచి 2014 వరకు హైదరాబాద్ అదనపు పోలీస్ కమిషనర్(క్రైమ్స్)గా బాధ్యలు నిర్వర్తించారు. 2016లో సైబరాబాద్ పోలీస్ కమిషనర్‌గా పనిచేశారు. 2018 నుంచి రైల్వే ఏడీజీగా పనిచేసి.. అక్కడి నుంచి పోలీస్ అకాడమీ డైరెక్టర్‌గా వెళ్లారు. తాజాగా.. హైదరాబాద్ పోలీస్ కమిషనర్‌గా నియమించారు.

## 10మంది డీసీపీలు, జాయింట్ సీపీ బదిలీ

**కమిషనర్లు, ఎస్పీలుగా పోస్టింగ్**

సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో భారత ఎన్నికల కమిషన్ మరోసారి భారీగా ఐపీఎస్‌లను బదిలీ చేసింది. ఇందులో భాగంగా మూడు పోలీసు కమిషనరేట్ల పరిధిలో 10 మంది డీసీపీలు, జాయింట్ సీపీ, అదనపు సీపీలను బదిలీ చేసి, ఇతర జిల్లాల్లో కమిషనర్లు, ఎస్పీలుగా పోస్టింగ్‌లు కల్పించింది. వివరాలిలా ఉన్నాయి. రాచకొండ జాయింట్ కమిషనర్‌గా విధులు నిర్వర్తిస్తున్న అంబర్ కిశోర్ ఝాను ఇక్కడి నుంచి బదిలీ చేసి, వరంగల్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. సైబరాబాద్ క్రైమ్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న కల్మేశ్వర్ సింగెన్వర్‌ను అక్కడి నుంచి బదిలీ చేసి, నిజామాబాద్ కమిషనర్‌గా, హైదరాబాద్ సౌత్- ఈస్ట్ జోన్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న చెన్నూరి రూపేశ్‌ను ఇక్కడి నుంచి బదిలీ చేసి, సంగారెడ్డి జిల్లా ఎస్పీగా, తెలంగాణ స్టేట్ స్పెషల్ పోలీస్ 4వ బెటాలియన్ కమాండర్ సీహెచ్. సింధు శర్మను బదిలీ చేసి, కామారెడ్డి ఎస్పీగా, సైబరాబాద్ ట్రాఫిక్ డీసీపీ-1గా విధులు నిర్వర్తిస్తున్న హర్షవర్ధన్‌ను ఇక్కడి నుంచి బదిలీ చేసి, మహబూబ్‌నగర్ ఎస్పీగా, సైబరాబాద్ సైబర్ క్రైమ్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న రితిరాజ్‌ను అక్కడి నుంచి బదిలీ చేసి, జోగులాంబ ఎస్పీగా, సైబరాబాద్ అడ్మిన్ డీసీపీగా విధులు నిర్వర్తిస్తున్న యోగేశ్ గౌతమ్‌ను అక్కడి నుంచి బదిలీ చేసి, నారాయణపేట ఎస్పీగా పోస్టింగ్ కల్పించారు. కొత్త ప్రాంతాల్లో పోస్టింగ్‌లు పొందిన అధికారులు వెంటనే తమకు కేటాయించిన పోస్టుల్లో చేరాలని ఉత్తర్వులు జారీ చేశారు.

## అమ్మాయిలకే కాదు.. అబ్బాయిలకూ చెప్పండి

- మహిళలతో ఎలా నడుచుకోవాలో సూచించండి
- ఈవ్‌టీజర్స్ కౌన్సెలింగ్‌లో.. తల్లిదండ్రులకు సూచించిన షీ టీమ్స్



సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): ఆడపిల్లలు ఎలా ప్రవర్తించాలో తల్లిదండ్రులు చెబుతూ జాగ్రత్తలు తీసుకుంటారని, అబ్బాయిలకు మాత్రం చెప్పరని, అబ్బాయిలు మహిళలతో ఎలా ప్రవర్తించాలో తల్లిదండ్రులు చెబుతూ వారిలో చైతన్యం తీసుకురావాలని నగర జాయింట్ సీపీ (క్రైమ్స్) గజారావు భూపాల్ సూచించారు. గత నెలలో జరిగిన వినాయక నవరాత్రులు, నిమజ్జనంలో పోకిరీ చేష్టలకు పాల్పడిన 488 మంది షీ టీమ్స్‌కు పట్టుబడ్డారు. అందులో 191 మందికి వారి తల్లిదండ్రులు, సంరక్షకుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. సీసీఎస్‌లోని ఐదో అంతస్తులో ఉన్న కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం సైకాలజిస్ట్ గీతా చల్లా బృందం నిర్వహించిన కౌన్సెలింగ్ కార్యక్రమానికి జాయింట్ సీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాయింట్ సీపీ మాట్లాడుతూ.. పిల్లలను సన్మార్గంలో నడిపించడంలో తల్లిదండ్రుల పాత్ర కీలకమన్నారు. ప్రతి ఇంట్లో మహిళలు ఉంటారని, అబ్బాయిలు మహిళలతో ఎలా ఉండాలనే విషయాలను తల్లిదండ్రులు చెప్పాలన్నారు. మహిళలను గౌరవించాలని, వేధింపులకు గురిచేయడం, ఈవ్‌టీజింగ్ చేయడం నేరమన్నారు. ఈ కార్యక్రమంలో డీసీపీ కవిత, ఏసీపీ ప్రసన్న లక్ష్మి, ఇన్‌స్పెక్టర్ ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## డ్యాష్ బోర్డుపై పోలీస్ టోపీ

- కారు డిక్కీలో గంజాయి పొట్లాల స్మగ్లింగ్
- ఇద్దరి అరెస్టు.. రూ.70 లక్షల సొత్తు స్వాధీనం



సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): కారు డ్యాష్ బోర్డుపై సబ్ ఇన్‌స్పెక్టర్ టోపీ.. డిక్కీలో గంజాయి పొట్లాలతో వెళ్తున్న ఒక గంజాయి స్మగ్లింగ్ ముఠాను మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ, చౌటుప్పల్ పోలీసులు కలిసి పట్టుకున్నారు. ఈ ముఠా నుంచి రూ. 70 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ వివరాలను శుక్రవారం రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ మీడియాకు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన సందీప్ అనిల్ చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నాడు. ఈ క్రమంలోనే గంజాయి రవాణా చేసి భారీగా డబ్బు సంపాదించవచ్చని ఆలోచించాడు. అతడి స్నేహితుడైన విశాల్‌కు ఒక్కో ట్రిప్పుకు రూ. 25 వేలు ఇస్తానని,తనకు సహాయం చేయాలని కోరాడు. ఒడిశాలోని మల్కాన్‌గిరిలో లక్ష్మణ్ అనే వ్యక్తిని కలుసుకున్నాడు. గంజాయి విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నానని లక్ష్మణ్ హామీ ఇవ్వడంతో.. సందీప్ ఒక హుందాయ్ క్రెటా కారును కొనుగోలు చేశాడు. మహారాష్ట్రకు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్ టోపీ (నకిలీ) తయారు చేసుకొని కారులో దాచి పెట్టాడు. అందరికీ కనిపించేలా ఆ టోపీని డ్యాష్ బోర్డుపై పెట్టి..మల్కాన్‌గిరి వెళ్లారు. అక్కడ 200 కిలోల గంజాయి కొనుగోలు చేసి.. కారు డిక్కీలో దాచాడు. తిరిగి మహారాష్ట్రకు బయలుదేరారు. విశ్వసనీయ సమాచారం మేరకు.. మహేశ్వరం ఎస్‌ఓటీ, చౌటుప్పల్ పోలీసులు పంతంగి చెక్‌పోస్టు వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. దీంతో ఇద్దరిని అరెస్టు చేసి, కారుతో పాటు అందులో ఉన్న 200 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

## భవనం పైనుంచి పడి కార్మికుడు మృతి

శంషాబాద్ రూరల్, అక్టోబర్ 13 : నిర్మాణంలో ఉన్న భవనం పైనుంచి కిందపడి కార్మికుడు మృతి చెందిన ఘటన శంషాబాద్ ఎయిర్‌పోర్టు పరిధిలో జరిగింది. ఎస్‌ఐ సుమన్ కథనం ప్రకారం.. శంషాబాద్ ఎయిర్ పోర్టులోని నోవాటెల్ వెనుక భాగంలో అమిటీ వర్సిటీ (విశ్వవిద్యాలయం)కి సంబంధించిన భవన నిర్మాణాలు చేపట్టారు. అయితే, అక్కడ కూలీ పనులు చేయడానికి వచ్చిన ఉత్తరప్రదేశ్‌కు చెందిన రామ్‌కరణ్ (26) గురువారం పనులు చేస్తూ భవనం పైనుంచి ప్రమాదవశాత్తు కిందపడటంతో తీవ్ర గాయాలయ్యాయి. తోటి కార్మికులు వెంటనే శంషాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. అప్పటికే అతడు మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## గంటలోపే కారును తెచ్చిచ్చారు

- స్టార్ హోటల్‌లో పోర్షే కారును పార్కు చేసిన నిర్మాత దిల్ రాజు అల్లుడు
- స్కూటీపై వచ్చి తస్కరించిన మన్నూరాబాద్‌కు చెందిన యువకుడు

బంజారాహిల్స్, అక్టోబర్ 13: సినీ నిర్మాత దిల్‌రాజు అల్లుడికి చెందిన ఖరీదైన కారును తస్కరించిన వ్యక్తిని జూబ్లీహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. నిర్మాత దిల్‌రాజ్ అల్లుడు అర్చిత్‌రెడ్డి శుక్రవారం ఉదయం జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌కు వచ్చాడు. హోటల్ ఆవరణలోని పార్కింగ్‌లో తన పోర్షే కారును పార్క్ చేసి.. లోనికి వెళ్లాడు. పావుగంట తర్వాత బయటకు వచ్చిన అతడికి పార్కింగ్‌లో కారు కనిపించలేదు. దీంతో ఆందోళనకు గురైన అతడు హోటల్ సీసీ కెమెరాలను పరిశీలించగా.. స్కూటీపై వచ్చిన ఓ యువకుడు కారును చోరీ చేసి పారిపోతున్న దృశ్యం కనిపించింది. వెంటనే డయల్ 100 ద్వారా జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రూ.1.20 కోట్ల విలువజేసే స్పోర్ట్స్ కారు చోరీకి గురైనట్లు సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వీరశేఖర్, డీఎస్‌ఐ రాజశేఖర్‌తో పాటు క్రైం పోలీసులు రంగంలోకి దిగారు. రోడ్లపై ఉన్న సీసీ కెమెరాలను పరిశీలించగా.. నీరూస్ చౌరస్తా మీదుగా చెక్‌పోస్ట్ వైపు కారు వెళ్తున్నట్లు గుర్తించారు. వెంటనే జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద, కేబీఆర్ పార్కు వద్ద డ్యూటీలో ఉన్న ట్రాఫిక్ పోలీసులను అప్రమత్తం చేశారు. చెక్‌పోస్ట్ నుంచి కేబీఆర్ పార్కు వైపు వెళ్తున్న కారును అడ్డగించారు. కారులోని యువకుడిని ప్రశ్నించగా.. సరైన పత్రాలు చూపించలేదు. దీంతో అతడిని జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించారు.

### ఆకాశ్ అంబానీ మేనేజర్‌ను అంటూ..

చోరీ చేసిన కారుతో పట్టుబడిన యువకుడు మన్నూరాబాద్‌కు చెందిన మల్లెల సాయికిరణ్(30)గా పోలీసులు గుర్తించారు. అతడిని జూబ్లీహిల్స్ పోలీసులు ప్రశ్నించగా.. తాను ముఖేశ్ అంబానీ కొడుకు ఆకాశ్ అంబానీకి మేనేజర్‌గా పనిచేస్తున్నట్లు చెప్పాడు. బాలీవుడ్ హీరో హృతిక్ రోషన్ తనకు మేనేజర్ అంటూ.. పొంతనలేని సమాధానాలు ఇవ్వడంతో అతడి మానసిక స్థితిపై పోలీసులకు అనుమానం వచ్చింది. మరిన్ని ప్రశ్నలు వేసినా.. సంబంధం లేని జవాబులు ఇవ్వడంతో సాయికిరణ్‌పై కేసు నమోదు చేశారు. దసపల్లా హోటల్ పార్కింగ్‌కు వచ్చిన సాయికిరణ్.. కొద్దిసేపు అక్కడే తచ్చాడిన తర్వాత అక్కడికి వచ్చిన అర్చిత్ రెడ్డి కారుకు లాక్ వేయకపోవడం వల్లే చోరీ చేసినట్లు పోలీసులు గుర్తించారు. ఆ కారులో నిందితుడు సుమారు 45 నిమిషాల పాటు ప్రధాన రోడ్లపై చక్కర్లు కొట్టిన అనంతరం పోలీసులకు పట్టుబడ్డాడు. సాయికిరణ్‌పై వనస్థలిపురం పీఎస్‌లో కూడా కేసు ఉన్నట్లు పోలీసుల విచారణలో తేలింది.

## మాదాపూర్‌లో నకిలీ విదేశీ మద్యం పట్టివేత: ముగ్గురి అరెస్ట్



సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ)/మాదాపూర్: నకిలీ విదేశీ మద్యం విక్రయిస్తున్న ముగ్గురిని శంషాబాద్ డీటీఎఫ్, శేరిలింగంపల్లి ఎక్సైజ్ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుల వద్ద నుంచి రూ.77,200వి లువ చేసే 52 నకిలీ విదేశీ మద్యం బాటిళ్లతో పాటు మద్యం నింపడానికి సిద్ధంగా ఉన్న మరో 55 బాటిళ్లు, 105 విదేశీ మద్యం లేబుల్స్, క్యాప్స్, రెండు సెల్‌ఫోన్లను సీజ్ చేశారు. శంషాబాద్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ సత్యనారాయణ కథనం ప్రకారం.. కొన్ని రోజులుగా మాదాపూర్, శేరిలింగంపల్లి ప్రాంతాల్లో నకిలీ విదేశీ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంది. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం శంషాబాద్ డీటీఎఫ్, శేరిలింగంపల్లి ఎక్సైజ్ అధికారులు సంయుక్తంగా మాదాపూర్, జూబ్లీహిల్స్‌లోని వెంకటగిరిలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో భాగంగా సంజయ్ సొంతల, మలయ పాత్రో, సంగ్రామ్ భారత్‌ను అదుపులోకి తీసుకుని విచారించారు. నకిలీ మద్యం ఖాళీ సీసాల్లో నింపి, వాటికి విదేశీ బ్రాండ్లకు సంబంధించిన లేబుల్స్, క్యాప్స్ వేసి విక్రయిస్తున్నట్లు అంగీకరించారు. దీంతో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి, వారి వద్ద సొత్తు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును శేరిలింగంపల్లి ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు.

## ద్విచక్ర వాహనాల దొంగల అరెస్టు

సిటీబ్యూరో, అక్టోబర్ 13 (నమస్తే తెలంగాణ): ద్విచక్ర వాహనాలు దొంగిలిస్తున్న ఇద్దరిని సీసీఎస్ సౌత్-వెస్ట్ జోన్ టీమ్ బృందం అరెస్ట్ చేసింది. పిట్టల నరేశ్, పిట్టల నాను, పార్థి రాములు చెడు అలవాట్లకు బానిసయ్యారు. ఈ ముగ్గురు కలిసి ఓ గ్యాంగ్‌గా ఏర్పడి.. పార్కింగ్ చేసిన వాహనాలను అపహరిస్తున్నారు. ట్రై పోలీస్ కమిషనరేట్ పరిధిలో 10 వాహనాలను అపహరించారు. ఇందులో నరేశ్ పరారీలో ఉండగా.. మిగతా ఇద్దరిని అరెస్టు చేశారు. తదుపరి విచారణ నిమిత్తం నిందితులను కేపీహెచ్‌బీ పోలీసులకు అప్పగించారు.

☞ఇదిలా ఉండగా.. మేడ్చల్‌కు చెందిన జహంగీర్ కూడా బొల్లారం ప్రాంతంలో వాహనాలను దొంగిలించాడు. అతడిని కూడా అరెస్టు చేసిన పోలీసులు ఒక వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. తదుపరి విచారణ నిమిత్తం అతడిని బొల్లారం పోలీసులకు అప్పగించారు.

## ఉద్యోగులకు మ్యాన్ ఆఫ్ ది మంత్ భద్రతా అవార్డులు

**ఉద్యోగులను అభినందించిన దక్షిణ మధ్య రైల్వే జీఎం**

సిటీబ్యూరో, అక్టోబర్ 13(నమస్తే తెలంగాణ): దక్షిణ మధ్య రైల్వేలోని వివిధ డివిజన్లలోని సిబ్బంది తమ విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉంటూ అంకితభావంతో విధులు నిర్వహించిన 12 మంది ఉద్యోగులకు 'మ్యాన్ ఆఫ్ ది మంత్' భద్రతా అవార్డులను సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో శుక్రవారం వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతో కలిసి వర్చువల్‌గా జరిగిన భద్రతా సమీక్షా సమావేశంలో దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్‌జైన్ అందజేశారు. ఈ సందర్భంగా అరుణ్‌కుమార్ జైన్ మాట్లాడుతూ.. రైలు కార్యకలాపాల భద్రతను సమీక్షించారు. రైళ్లను సురక్షితంగా నడిపేందుకు భద్రతా విధానాలను కచ్చితంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. తరుచుగా క్షేత్ర స్థాయి తనిఖీలు నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్, గుంటూరు, నాందేడ్ డివిజన్లకు చెందిన రైల్వే మేనేజర్లు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.